క్లుప్తంగా

23న ఇసుక డంప్ వేలం



ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

తూప్రాన్: అక్రమంగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ఇసుక డంప్‌ను ఈ నెల 23న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామ శివారులో హల్దీవాగులో అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేసి విక్రయానికి సిద్ధం చేసిన ఇసుక డంప్‌ను, విద్యుత్ బోరు మోటారు స్టాటర్లు, వైర్లు రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా దాడి చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుక డంప్‌ను ఆర్డీఓ జయచంద్రారెడ్డి అనుమతులతో ఈ నెల 23న వేలం పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 21న శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రూ.5వేలతో డిమాండ్ డ్రాఫ్ అందించాలని సూచించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ శివానందంతో పాటు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రేం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల



ఫైజాబాద్‌లో మూసి ఉన్న పశువైద్యశాల

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని ఫైజాబాద్‌లో గల పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. దాంతో కొంత కాలంగా పశువైద్యశాలను తెరవడం లేదు. మండలంలోని ఫైజాబాద్‌లో పశువులు అధికంగా ఉన్నాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో వైద్య సేవలు అందడం లేదు. ఈ విషయమై పశువైద్యుడు వినోద్‌ను వివరణ కోరగా, మండలంలో చిట్కుల్‌లో ఉన్న పశు వైద్యశాల నుంచే తమ సిబ్బందితో పశువైద్య సేవలు అందిస్తున్నామని, త్వరలో బదిలీలు జరిగితే సిబ్బంది పెరిగే అవకాశం ఉందన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి

ఎంపీడీఓ శ్రీనివాస్



భుజిరంపేట పీర్యతండాలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): వన మహోత్సవం కార్యక్రమానికి నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉండేలా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని భుజిరంపేట, పీర్యతండా, మనంతయపల్లి తండాలలో వన నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడగానే ప్రభుత్వం వనమహోత్సవం మొక్కలునాటే కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. దీని కోసం ఇప్పటికే ప్రతి గ్రామంలోని వన నర్సరీలో ఐదు వేల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. మొక్కలు ఏపుగా పెరిగి వన మహోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్యం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

నర్సాపూర్ రూరల్: పేదలందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని అహ్మద్‌నగర్‌లో శుక్రవారం ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఇందిరాగాంధీ గరీబీ హటావో పథకం ద్వారా అనేక మందికి ఇళ్లు నిర్మించి ఇచ్చిందన్నారు. ఆ స్ఫూర్తితోనే ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, రూ. 500 గ్యాస్ సబ్సిడీ, సన్న బియ్యంతో నిరుపేదలను ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు జ్యోతి, లలిత, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, మాజీ ఎంపీటీసీ అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు హరీశ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ నిబంధనలు సడలించాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిబంధనలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని సడలించి లబ్ధిదారులకు మేలు చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినా వాటి నిర్మాణంలో విధించిన నిబంధనలతో లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చిందని, ఎంపిక చేసిన గ్రామాలలో లబ్ధిదారులను గుర్తించి ఒకే చోట ఇళ్ల నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అందచేసిందని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో ప్రభుత్వం లబ్ధిదారులకు కనీస వసతులు కల్పించిందని ఆమె గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నప్పటికీ ఇంటి నిర్మాణం 60గజాల విస్తీర్ణం దాటరాదని, పిల్లర్లు నిర్మించకుండా గోడల పైనే స్లాబ్ వేయాలని, ఇంటికి ఎక్కువ తలుపులు పెట్టవద్దని తదితర నిబంధనలతో లబ్ధిదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పిల్లర్లు లేకుండా ఇంటి నిర్మాణం చేపడితే మున్ముందు ఆ ఇంటిపై మరో స్లాబ్ వేసి మరో అంతస్తు నిర్మించుకునే అవకాశం ఉండదన్నారు. ఐదెకరాల లోపు భూమి ఉండి ఉండాలని, ట్రాక్టర్ ఉండరాదని, గతంలో ప్రభుత్వం నుంచి ఇల్లు పొంది ఉండరాదని తదితర నిబంధనలతో వ్యవసాయంపై ఆధారపడిన ఇల్లులేని పేద రైతు కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు అందకుండా పోతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు అగ్గిపెట్టె మాదిరిగా ఉన్నాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం విధించిన నిబంధనలు సడలించి పేదలకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సునీతారెడ్డి అన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద నర్సాపూర్, కౌడిపల్లి, హత్నూర మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి చెక్కులు అందచేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, సత్యంగౌడ్, నయీం, భిక్షపతి, ప్రసాద్, బబియా, దుర్గారెడ్డి, ఎల్లం, సందీప్, ప్రతాప్‌గౌడ్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకు సాధిస్తే రూ.లక్ష బహుమతి

- పదో తరగతి విద్యార్థులకు ఆఫర్
- ఎస్‌వీఎస్ ట్రస్టు అధినేత భారతి



విద్యార్థులతో ఎస్‌వీఎస్ ట్రస్టు అధినేత భారతి, డీఈఓ రాధాకిషన్, అధికారులు

మెదక్‌జోన్: వచ్చే ఏడాది పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు రూ.లక్ష బహుమతిగా ఇవ్వనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఎస్‌వీఎస్ ట్రస్టు అధినేత భారతి పేర్కొన్నారు. మెదక్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు శుక్రవారం ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం లక్ష బహుమతి ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులను ఆదుకుంటామని చెప్పారు. అనంతరం జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ, తాము పేద విద్యార్థులని అనుకోవద్దని సరస్వతి మీ దగ్గర ఉన్నట్లయితే లక్ష్మి దానంతటా అదే వస్తుందని విద్యార్థులకు హితబోధ చేశారు. మీరంతా ప్రేరణ పొంది రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ, మండల విద్యాధికారి శంకర్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి

రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద

రామాయంపేట(మెదక్): సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి సూచించారు. శుక్రవారం మండలంలోని రాయిలాపూర్‌లో శ్రీరామచంద్రస్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన భక్తి ప్రవచనాలు చేశారు. అనంతరం శివాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటాం

నర్సాపూర్: దేశ వ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటామని గ్రామ పంచాయతీ కార్మికులు తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసును ఎంపీడీఓ ఆఫీసు సూపరింటెండెంట్ మనోహర్‌కు శుక్రవారం అందచేశారు. జూలై 9న జరిగే సమ్మెలో పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్మికుల వెంట సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి : ఎంపీడీఓ

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..నిబంధనల మేరకు అధికారులు మార్కింగ్ చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. పనులు జరిగిన వెంటనే బిల్లులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్జాపల్లి మాజీ సర్పంచ్ జనార్దన్, మాజీ ఎంపీపీ అరుణ, కాంగ్రెస్ నాయకులు మనోజ ప్రభాకర్, భాస్కర్‌గౌడ పాల్గొన్నారు.

2,153 దరఖాస్తులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో శుక్రవారం తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూసమస్యలపై 2,153 దరఖాస్తులు స్వీకరించారు. అధిక శాతం ప్రభుత్వ భూముల కొనుగోలుకు సంబంధించిన దరఖాస్తులు, సాదాబైనామాలు ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటతామన్నారు.

కళాశాల మైదానంలో లైటింగ్ ఏర్పాటు

రామాయంపేట(మెదక్): జూనియర్ కళాశాల మైదానంలో లైటింగ్ సదుపాయం కోసం విష్ణు సీడ్స్ ప్రతినిధులు సహకారం అందజేశారు. అవసరమైన లైట్లను విష్ణు సీడ్స్ అధినేత చంద్రం కొనుగోలు చేసి శుక్రవారం క్రీడాకారులకు అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు స్కూలు బస్సుల సీజ్



ప్రైవేట్ బస్సును సీజ్ చేసిన ఎంవీఐ, ఎస్‌ఐలు

అల్లాదుర్గం(మెదక్): నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ ఎంవీఐ శ్రీనివాస్, అల్లాదుర్గం ఎస్‌ఐ శంకర్ హెచ్చరించారు. అల్లాదుర్గంలో శుక్రవారం స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని మూడు ప్రైవేట్ స్కూల్ బస్సులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లాదుర్గంలోని శ్రీవాణి విద్యానికేతన్, డాన్‌బాస్కో, సెంట్‌మేరీ పాఠశాలలకు చెందిన బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండటంతో సీజ్ చేశామన్నారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిషన్ కాగితాలు ఖచ్చితంగా ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ప్రైవెట్ పాఠశాల యజమాన్యాలు అనుభవం ఉన్న డ్రైవర్లతో బస్సులు నడిపిస్తే ప్రమాదాలు జరగవన్నారు.

స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌గా ఉండాలి

పాపన్నపేట(మెదక్): స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండేలా చర్యలు తీసుకోవాలని మెదక్ ఎంవీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. శుక్రవారం పాపన్నపేట మండలంలోని ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. నార్సింగి, పాపన్నపేట పాఠశాలలకు చెందిన ఐదు బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్సు డ్రైవర్లు, ,పాఠశాల యజమానులతో వారు మాట్లాడుతూ.. బస్సులు నిరంతరం పరిశీలిస్తూ ఉండాలన్నారు. డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి బస్సులు నడిపితే ,కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

మెదక్ మున్సిపాలిటీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్‌బీఐ ఆవిర్భవించి జూలై ఒకటి నాటికి 70 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ప్రతీ రీజియన్‌లో ఈ మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మెదక్‌లో కూడా శిబిరం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో 83 మంది ఎస్‌బీఐ సిబ్బంది, వాలంటీర్లు కలిసిబ్లడ్ బ్యాంక్‌కు రక్తం దానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డాక్టర్ సునీల్ చౌదరి, ఇతర అధికారులు సంతోష్, బాలమురళి కృష్ణ, రాంబాబు, రామకృష్ణ, నరసింహ చారి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామకిశోర్, మెదక్ బ్రాంచ్ మేనేజర్ రవి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుడికి హక్కులున్నాయి

అల్లాదుర్గం(మెదక్): ప్రతి వినియోగదారుడికి ప్రశ్నించే హక్కు ఉందని ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సాయి ప్రభాకర్ అన్నారు. అల్లాదుర్గంలో శుక్రవారం వినియోగదారుల హక్కులపై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారుడికి కొన్ని హక్కులు ఉన్నాయని, న్యాయం అందించేందుకు ఫోరంలు, కమిషన్‌ల ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ చట్టాలపై అవగాహన అవసరమని చెప్పారు. మన హక్కులను ఎలా వినియోగించుకోవాలి.. సమస్య వచ్చినప్పుడు ఎలా న్యాయ సహాయం పొందాలో తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరుణాకర్, సిద్దాగౌడ్, శారద తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

కాంగ్రెస్ నేత రాజిరెడ్డి



మానెపల్లిలో ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి తదితరులు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలకు సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ నేత రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మానెపల్లి, మంగళపర్తి, యశ్వంతరావ్‌పేట, ఎం.జలాల్‌పూర్, కుకునూర్, వెల్దుర్తి, మెల్లూర్, హస్తాల్‌పూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులతో కలిసి నిర్మాణ పనులకు వారు భూమి పూజ చేశారు. పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. యశ్వంతరావ్‌పేటలో పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశం, పోతిరెడ్డి, శ్రీనివాస్, శేఖర్, మల్లేశంచారి తదితరులు పాల్గొన్నారు.

బండపోతుగల్లో తాగునీటి ఎద్దడి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలం బండపోతుగల్ గ్రామం తాగునీరు సరఫరా కాకపోవడంతో కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో మూడు రక్షిత మంచి నీటి ట్యాంకులు ఉండగా, రెండు ట్యాంకులకు మాత్రమే మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుంది. మరో ట్యాంకు ఎత్తుపై ఉండటంతో భగీరథ నీటి సరఫరా చేయడం లేదు. పంచాయతీ బోరు నుంచి నీటిని సరఫరా చేసేవారు. నెల రోజులుగా ఈ నీరు కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదు. తాగునీటి కోసం, పనులు మానుకోవడంతో పాటు, నానా అవస్థలు పడాల్సివస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌ను వివరణ కోరగా ఈ మధ్య కాలంలో పంచాయతీ బోరుమోటర్ నాలుగు సార్లు చెడిపోతే మరమ్మతులు చేయించామని, మరమ్మతు చేయించిన వారం రోజుల్లోనే ఆ మోటర్ చెడిపోవడంతో సమస్య ఎదురవుతుందన్నారు. కొత్త మోటర్ ఏర్పాటు చేసేందుకు పంచాయతీలో నిధులు లేవన్నారు.

బస్సులు నడపాలని వినతి

నర్సాపూర్: నర్సాపూర్ నుంచి మండలంలోని నత్నాయిపల్లి వరకు ఆర్‌టీసీ బస్సులు నడపాలని పలు గ్రామాల నాయకులు శుక్రవారం స్థానిక ఆర్‌టీసీ డిపో కంట్రోలర్ వెంకట్‌గౌడ్‌కు వినతిపత్రం అందచేశారు. నత్నాయిపల్లి, కాగజ్‌మద్దూర్, కొండాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు శివకుమార్, ఉదయ్‌కుమార్, నగేష్, మహేశ్వర్, హరి, మహేష్ తదితరులు మాట్లాడుతూ నర్సాపూర్ నుంచి కొండాపూర్, కాగజ్‌మద్దూర్ మీదుగా నత్నాయిపల్లి వరకు ఆర్‌టీసీ అధికారులు గతంలో బస్సులు నడిపే వారని, సుమారు ఆరు నెలలుగా బస్సులు నడిపనందున విద్యార్థులు చాలా ఇబ్బందుల పాలవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు పునః ప్రారంభించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని వారు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానని కంట్రోలర్ చెప్పారు.



కంట్రోలర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ప్రజలు

ఘనంగా జగదాంబదేవి వార్షికోత్సవం



కొత్తచెరువుతండాలో ఆలయ వార్షికోత్సవంలో పూజలు చేస్తున్న తండవాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువు తండాలో శ్రీజగదాంబదేవి, సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయం నాల్గవ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముంగి దేవగిరి మహారాజ్ ఆధ్వర్యంలో దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద హోమం నిర్వహించి బోగ్‌బండార్ నిర్వహించారు. వార్షికోత్సవంలో తండావాసులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కొత్త చెరువుతండాలోని శ్రీజగదాంబదేవి ఆలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు ఎస్ కిషన్, కే కిషన్, మాజీ సర్పంచ్‌లు పద్మ, ఎల్లం, దివ్య, ధర్మనాయక్, నాయకులు దశరథ్, మహిపాల్‌రెడ్డి, గోపాల్, పూల్‌సింగ్, రాజు, శంకర్‌నాయక్ అతదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల యోగాసనాలు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం మదూర్ జెడ్పీపాఠశాలలో శుక్రవారం ముందస్తుగా యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణయామం చేయించారు. ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, పీడీ నరేష్ యోగా ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, ఆంజనేయులు, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మదూర్ జెడ్పీపాఠశాల ఆవరణలో యోగసనాలు చేస్తున్న విద్యార్థులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత నాగరాజు

నర్సాపూర్: జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నర్సాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, వాటితో కార్మికులకు నష్టం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆసీఫ్, నాయకులు చంద్రయ్య, మహేష్, నర్సింలు, భిక్షపతి, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సైబర్ నేరాలపై అప్రమత్తం

శివ్వంపేట(నర్సాపూర్): సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మధుకర్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ తెలియని నంబర్ల నుంచి సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేయకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఇబ్బందులు తలెత్తితే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

◆ 2,655 దరఖాస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): భూభారతిలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. మండల వ్యాప్తంగా 25 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా.. 2,655 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం శివ్వంపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్‌ఐ కిషన్ ఉన్నారు.

◆ విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించండి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం సీనియర్ ఇంజనీర్ ప్రకాశ్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

◆ గౌతాపూర్‌లో సబ్‌స్టేషన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ శివారులోని గౌతాపూర్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా సివిల్ ఈఈ సుకుమార్‌రెడ్డి అన్నారు. గతంలో గుర్తించిన స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి కొలతలు తీసి మార్కింగ్ చేశామన్నారు. మంజూరైన నిధులతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సబ్ ఇంజనీర్ శివకుమార్, మండల ఇన్‌చార్జి ఏఈ సల్మాన్, లైన్‌మేన్ రూప్‌సింగ్, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గౌతాపూర్ మాజీ సర్పంచ్ భీమయ్య పాల్గొన్నారు.

◆ తునికిలో ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికిలో ఇందిరమ్మ ఇంటికి శుక్రవారం పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామస్తులు ముగ్గువేసి పనులు ప్రారంభించారు. గ్రామంలో 13 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిని త్వరగా నిర్మాణం పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నాలుగు విడతలతో రూ 5లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రభుచారి, చల్ల మల్లేశం, నర్సాగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ పాపన్నపేటలో 4029 దరఖాస్తులు

పాపన్నపేట(మెదక్): భూభారతిలో భాగంగా పాపన్నపేట మండలంలో మొత్తం 4029 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. పూర్వపరాలను పరిశీలించి, వాటికి పరిష్కారం చూపుతామన్నారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

రేగోడ్(మెదక్): ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం పేదలకు వరమని మాజీ ఎంపీటీసీలు నాగిరెడ్డి, నర్సింహులు అన్నారు. మండలంలోని కొత్వాన్‌పల్లిలో శుక్రవారం ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాకారం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు నారాయణ, కిష్టయ్య, కిషన్ కుమార్, దుర్గయ్య, కిషన్ నాయక్, అశోక్, డాంపాల్, విట్టల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆపదలో అండగా ఆరోగ్య బీమా

దుబ్బాకటౌన్: ఖాతాదారులు ఎస్‌బీఐ ఆరోగ్య బీమాను సద్వినియోగం చేసుకోవాలని రిజినల్ మేనేజర్ మారుతి సూచించారు. చెర్వాపూర్ వార్డుకు చెందిన మద్దుల రంజిత్ కుమార్‌రెడ్డి ఇటీవల ఆరోగ్య బీమాకు దరఖాస్తు చేసుకున్నాడు. తన కూతురు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడంతో ఆరోగ్య బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును శుక్రవారం రంజిత్ కుమార్‌రెడ్డికి అందజేశారు. మేనేజర్ సందీప్ కుమార్, గుణశేఖర్, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

◆ ఏటీసీ మంజూరుతో సంబురాలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని తోటపల్లిలో ఏటీసీ (అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్) మంజూరు కావడంతో గ్రామస్తులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు మాట్లాడుతూ ఏటీసీ రావడంతో తోటపల్లి ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.